## క్లుప్తంగా

### నిధులు మంజూరు



మంజూరు పత్రం అందజేస్తున్న నాయకులు

**రామడుగు:** మండల కేంద్రంలోని బుడిగజంగాల కాలనీలో ఎంపీ బండి సంజయ్‌కుమార్ కోటా నుంచి రూ.లక్షాయాభై వేల నిధులు బోర్‌వెల్ కోసం మంజూరు చేశారు. నిధుల మంజూరు పత్రాన్ని మంగళవారం కాలనీ వాసులకు బీజేపీ నాయకులు కట్ట రవీందర్, జిట్టవేని అంజిబాబు అందజేశారు. ఈసందర్భంగా నిధులు మంజూరీ చేసినందుకు ఎంపీకి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు వెంకటేశం, కనకమల్లు, నర్సయ్య, మల్లయ్య పలువురు పాల్గొన్నారు.

### లక్ష్యం కోసం కష్టపడాలి

**సైదాపూర్:** విద్యార్థులు లక్ష్యం కోసం కలలు కనాలని, వాటి సాకారం కోసం కష్టపడాలని ఆకునూర్ హెచ్‌ఎం బొట్ల రామస్వామి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వెన్కెపల్లి ఉన్నత పాఠశాలలో భూమిక మహిళా కలెక్టివ్ హైదరాబాద్, వెన్నెల మహిళా ఫెడరేషన్ సైదాపూర్ ఆధ్వర్యంలో కౌమార దశలో వచ్చే మార్పులు, భయాలు, అభిప్రాయాలు, అభద్రతా భావాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆకర్షణ వైపు కాకుండా, వాస్తవాలు, మంచివైపు పయనిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దేవేందర్‌రెడ్డి, వెన్నెల పీడీ వెంకట్‌రెడ్డి, కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి, స్వరూపా, వెన్నెల, స్వాతి ఉన్నారు.

### సైకిళ్లు పంపిణీ



సైకిళ్లు అందిస్తున్న స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు

**చొప్పదండి:** పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు మంగళవారం సైకిళ్లు పంపిణీ చేశారు. ఉమెన్స్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా సైకిళ్లు మంజూరయ్యాయి. స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు జమున, ప్రవీణ్‌కుమార్ ఈమేరకు పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సైకిళ్లు బహూకరించారు. పాఠశాలకు దూర ప్రాంతాల నుంచి వస్తున్న బాలికలను గుర్తించి అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వైద్యుల రాజిరెడ్డి, పీడీ కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### వీడ్కోలు హంగామా



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

**హుజూరాబాద్:** పట్టణంలోని న్యూ శాతవాహన హైస్కూల్‌లో మంగళవారం పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆదర్శ కరస్పాండెంట్ పరాంకుశం కిరణ్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ స్వరూపారాణి, టీచర్లు పాల్గొన్నారు.

### ఉత్సవమూర్తులకు అభిషేకం



అభిషేకం చేస్తున్న రమణాచార్యులు

**గన్నేరువరం:** మండలంలోని జంగపల్లి గ్రామం శ్రీమార్కండేయ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం మయూరగిరి పీఠాధిపతులు శ్రీమాన్ శ్రీనమిలికొండ రమణాచార్యస్వామి ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు అభిషేకం చేశారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, మహాకుంభ స్థాపన, శతస్థానార్చన హోమాలు, జలాధివాసం వంటి పూజ కార్యక్రమాలు, అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో రామకృష్ణామాచార్యులు, భరత్‌కుమారాచార్యులు, శ్రీకాంతాచార్యులు, శ్రీనాథాచార్యులు, కౌశికాచార్యులు, గీతాచార్యులు, రమేశ్‌స్వామి, వివేకస్వామి తదితర పండితులు, ఆలయ కమిటీ సభ్యులు, పద్మశాలీ కులబాంధువులు పాల్గొన్నారు.

### ఆరుగురు బైండోవర్

**చొప్పదండి:** జూలపల్లి మండలం పెద్దాపూర్‌కు చెందిన సయ్యద్ అలీమ్‌పై దాడిచేసిన ఘటనలో ఆరుగురిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని ఎస్‌ఐ ఉపేంద్రాచారి తెలిపారు. ఈ నెల 6న అలీమ్‌పై చొప్పదండికి చెందిన వారు దాడి చేశారని, తహసీల్దార్ ముందు బైండోవర్ చేశామని వివరించారు.

# డ్రెయినేజీలు లేక తంటాలు

- రామడుగులో ప్రధాన రహదారికి ఇరువైపులా కనిపించని మురుగునీటి కాలువలు
- వర్షాకాలంతో తప్పని తిప్పలు
- ఇళ్ల నుంచి బయటకెళ్లని నీరు



రామడుగు మండల కేంద్రంలో ప్రధాన రహదారి

**రామడుగు:** పేరుకు మాత్రమే మండల కేంద్రం.. కానీ ప్రధాన రహదారికి ఇరువైపులా మురుగునీటి కాలువలు లేని పరిస్థితి. దీంతో ప్రధాన రహదారి వెంట ఉన్న ఇంటియజమానులు నిత్యం తంటాలు పడాల్సిన పరిస్థితి. వర్షాకాలం వచ్చిందంటే పరిస్థితి మరీ దయనీయంగా ఉంటుందని మండల కేంద్రంలోని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రధాన రహదారి వెంట...**

రామడుగులోని శివాజీ చౌరస్తా నుంచి పోచమ్మ చౌరస్తా, అంబేడ్కర్ విగ్రహం వరకు ఉన్న దాదాపు కిలోమీటరున్నరపైగానే ప్రధాన రహదారికి అక్కడక్కడ కొద్దిపాటి దూరం వరకు మాత్రమే డ్రెయినేజీ వ్యవస్థ ఉంది. పూర్తిస్థాయిలో మురుగునీటి కాలువలు లేకపోవడంతో రహదారికి ఇరువైపులా ఉన్న ఇళ్లు, వ్యాపార సముదాయాల యాజమానులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా హోటళ్ల వారైతే చాలా ఇబ్బంది పడుతున్నారు.

**సీసీరోడ్డు నిర్మించినా...**

పోచమ్మ చౌరస్తా నుంచి జిల్లా పరిషత్ పాఠశాల వరకు పదిహేనేళ్ల క్రితం సిమెంట్ రోడ్డు నిర్మించారు. అయినా రహదారికి ఇరువైపుల మురుగునీటి కాలువలు లేవు. ప్రభుత్వం నిధులు కేటాయించి మురుగునీటి కాలువల నిర్మాణం జరిగేలా, సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. రహదారికి ఇబ్బంది లేకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ విధానం ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

### ఇబ్బంది పడుతున్నారు



ప్రధాన రహదారి వెంట మురుగునీటి కాలువ లేకపోవడంతో గ్రామస్తులు, రహదారి వెంట ఉన్న ఇంటి యజమానులు ఇబ్బందిపడుతున్నారు. సిమెంట్ రహదారి ఉన్నప్పటికీ డ్రైనేజీ లేకపోవడంతో వర్షాలు పడితే చాలా పరేషాన్ అవుతుంది. ఇండ్లల్లో మురుగునీరు బయటకు పోవడం లేదు.

– జిట్టవేని అంజిబాబు, రామడుగు


### బురదగా ఉంటుంది



ప్రధాన రహదారి వెంట మురుగునీటి కాలువలు లేని పరిస్థితి. వర్షాలు పడితే షాపుల ముందు నీరు నిలిచి బురదమయంగా తయారవుతోంది. దీంతో చాలా ఇబ్బందిపడుతున్నాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలి, ఇబ్బందులు తొలగించాలి.

– బొద్ల శ్రీధర్, షాపుయాజమాని, రామడుగు

## ప్రభుత్వ భూములు కాపాడాలి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పత్రం

**జమ్మికుంట:** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని పలు సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్న విషయంపై సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ ఫిర్యాదు చేశామని సామాజిక కార్యకర్త షేక్ సాబీర్ అలీ, పాత సత్యం, మేడిపల్లి మల్లికార్జున్ తెలిపారు. మంగళవారం పట్టణంలో మాట్లాడారు. పలువురికి ఆయా సర్వే నంబర్లలోని భూమిని కేటాయించగా మిగులు విలువైన భూములు నుంచి వ్యకిగతంగా లబ్ధి పొందేందుకు స్థానికంగా ఉన్న కొందరు వ్యక్తులు, రాజకీయ ప్రోద్బలంతో ప్రైవేటు వ్యక్తులకు విక్రయిస్తూ వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారని, రెవెన్యూ, మున్సిపల్‌శాఖ అధికారుల ప్రమేయంతో నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు ధృవపత్రాలు, అనుమతులు మంజూరు చేస్తూ విచ్చలవిడిగా భూ కబ్జాలకు పాల్పడుతున్నారని అన్నారు. ప్రశ్నించిన వారిపై దాడులకు దిగుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నామన్నారు. జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు చేసి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విన్నవించామన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ స్పందించి విచారణ చేపట్టాలని హుజూరాబాద్ ఆర్డీవో, జమ్మికుంట తహసీల్దార్‌కు సూచించారని తెలిపారు.

## సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ మహేందర్‌రెడ్డి

**రామడుగు:** మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామంలోని బీరప్ప దేవాలయం వద్దకు సీసీ రోడ్డు పనులను గ్రామ బీజేపీ నాయకులు మంగళవారం ప్రారంభించారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ రూ.పది లక్షలు మంజూరు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లచ్చయ్య, బీజేపీ జిల్లా నాయకులు రాంకిషన్, ఐలయ్య, రమేష్, కనకయ్య, కొంరయ్య, రాజయ్య, భరత్, సునీల్, కుమార్, సాగర్ పలువురు పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానం సరిగా వినియోగించాలి



మాట్లాడుతున్న మనోజ్‌కుమార్

**హుజూరాబాద్‌రూరల్:** సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు సరిగా వినియోగిస్తే అదుభత ఫలితాలు సాధించవచ్చని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భౌతికశాస్త్ర అధ్యాపకుడు జి.మనోజ్ కుమార్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామంకిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం డైరెక్టర్ డాక్టర్ కె.శంకర్ అధ్యక్షతన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ ఆర్సి–22, పాపులర్ సైన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ సైన్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం వినియోగిస్తున్న మొబైల్‌లోనే అన్ని రకాల అప్లికేషన్స్ అందుబాటులో ఉన్నాయని, ఏఐ ద్వారా భవిష్యత్‌లో మరిన్ని మార్పులు జరిగే ఆస్కారం ఉందన్నారు. టెక్నాలజీని సరైన విధానంలో ఉపయోగించటంలో విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను స్పెక్ట్రోస్కోపీ ఆర్జీసీ ఇంటెలిజెన్సీ సహాయంతో వేరువేరుగా విభజించి రీసైకిల్ చేస్తున్నామన్నారు. ఇంజనీరింగ్ విద్యకు పునాది వేసిన సి.వి.రామన్ అప్పుడు అందుబాటులో ఉన్న పరిమితమైన విజ్ఞాన వనరులు, పరికరాలతో అద్భుతమైన ఫలితాలు సాధించారని, ఆయనను ఆదర్శంగా తీసుకొని ప్రతి విద్యార్థి ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల హ్యూమానిటీస్ అండ్ సైన్స్ విభాగ అధిపతి డాక్టర్ వి.రాజేశ్వరరావు, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగ అధిపతి డీన్ డాక్టర్ ఎంవీ సతీష్‌కుమార్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జి. మల్లయ్య, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

## అన్నిరంగాల్లో ముందుండాలి



మాట్లాడుతున్న చైర్మన్ రాజేశ్వర్‌రావు

**జమ్మికుంట:** మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో జీవనజ్యోతి పట్టణ సమాఖ్య మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా చైర్మన్ రాజేశ్వర్‌రావు, కమిషనర్ అయాజ్ మాట్లాడుతూ పట్టణ సమాఖ్య మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తుందని, ఇతరులకు అప్పు ఇస్తూ అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. ప్రభుత్వ అధికారులు ఆదేశాలతో ఆర్పీలు అన్నిరకాల సేవలు చేస్తున్నారని, ప్రభుత్వం నెలకు రూ.ఆరువేల పారితోషకం అందిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో డీఎంసీ శ్రీవాణి, ఏడీఎంసీ మల్లీశ్వరి, సీఎల్ఆర్పీలు, జ్యోతి, మంజుల, సరళ, ఆర్పీలు ఓబీలు, సమాఖ్య మహిళ సభ్యులు పాల్గొన్నారు.

## దళితబంధు నిధులు ఆపింది బీఆర్‌ఎస్సే



సమావేశంలో మాట్లాడుతున్న సొల్లు బాబు

**హుజూరాబాద్:** గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు నిధులు ఆపి కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని, ముమ్మాటికీ దళితబంధు నిధులను ఆపింది బీఆర్‌ఎస్సేనని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సొల్లు బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో దళిత బంధు పథకం బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించి, రెండో విడుత నిధులు పంపిణీ చేసేందుకు సమయం ఉన్నా విడుదల చేయలేదన్నారు. నియోజకవర్గంలోని దళితులను రెచ్చగొట్టేందుకు స్థానిక ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారని, దళితబంధు డబ్బులు విడుదల చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలంగా ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో మండలాధ్యక్షురాలు లావణ్య, బీసీ సెల్ నియోజకవర్గ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మహిళా విభాగం అధ్యక్షురాలు పుష్పలత, మైనారిటీ పట్టణ అధ్యక్షులు అఫ్సర్, పార్టీ మండల అధ్యక్షుడు కిరణ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షురాలు సుశీల, హుజూరాబాద్ హనుమాన్ దేవస్థానం కమిటీ చైర్మన్ శంకర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**దళితబంధు నిధులపై ఆందోళన వద్దు..**

రెండో విడత దళితబంధు నిధులు రాలేదని లబ్ధిదారులు ఆందోళన చెందొద్దని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్ర కుమార్ అన్నారు. పట్టణంలో మాట్లాడుతూ.. దళితులందరికీ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందన్నారు. నిధుల మంజూరుపై నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఇప్పటికే మంత్రి పొన్నం ప్రభాకర్‌ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారని పేర్కొన్నారు.

## ఎంపీడీవోకు వినతి



**హుజూరాబాద్:** దళితబంధు పథకం నిధులు మంజూరుపై హుజూరాబాద్ ఎంపీడీవో సునీతకు ధర్మ సమాజ్ పార్టీ నాయకులు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. పథకం కింద యూనిట్లు ఏర్పాటు చేసుకున్న లబ్ధిదారులు రెండో విడుత నిధుల కోసం ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి శ్రీకాంత్, నాయకులు రాకేశ్, రాజు, శ్రీనివాస్, సదానందం, అశోక్, శ్రీనివాస్, సందీప్, సాగర్, అనిల్, రామ్, అభిలాశ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల సంబరాలు

**హుజూరాబాద్:** పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద కాంగ్రెస్ నాయకులు మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో మరో రెండు గృహ లక్ష్మి, గృహజ్యోతిని అమలు చేస్తుంటే ఓర్వలేకనే ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని అన్నారు.అనంతరం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు పుష్పలత,లంకదాసరి లావణ్య, సుశీల, సొల్లు సునిత, కొల్లూరి కిరణ్ కుమార్,సొల్లు బాబు,ఎర్ర రవీందర్, అఫ్సర్ తదితరులు ఉన్నారు.

**జమ్మికుంట:** కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేసిందని, ప్రభుత్వం ఏర్పడిన 80 రోజుల్లో నాలుగు గ్యారంటీలు అమలు చేసిందని టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యులు సాయిని రవి అన్నారు. రూ.500 గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమలు పట్ల పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ బడుగు,బలహీన వర్గాల అభివృద్ధి కోరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లయ్య, బోంగోని వీరన్న, పిట్టల శ్వేతరమేష్, నాయకులు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, పూదరి రేణుకశివకుమార్ గౌడ్ ,మొలుగూరి సదయ్య, గూడెపు సారంగపాణి, సజ్జు, రవీందర్, అయోధ్యగౌడ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

**ఇల్లందకుంట:** కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలులో భాగంగా మరో రెండు పథకాలు అమలుచేయడం మండలంలోని గడ్డివానిపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు గడ్డి శ్రీనివాస్,సాయిలు,లక్ష్మి,సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు సన్మానం



**రామడుగు:** ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు, బదిలీపైన వెళ్లిన పలువురు ఉపాధ్యాయులకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం స్కూల్ టీచర్లు సన్మానించారు. పదోన్నతి పొందిన మిక్కిలి హెనా హరియట్, అల్లాడి భారతి, అచి మంజుశ్రీ, బదిలీపై వెళ్లిన అవదూత శ్రీనివాస్‌కు శాలువాలు కప్పి, మొమెంటోలు అందించి సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పూరెల్ల రాజగోపాల్ గౌడ్, హెచ్‌ఎం పద్మజ, మాజీ సర్పంచ్ పంజాల ప్రమీల, పంజాల జగన్మోహన్‌గౌడ్, ఉపాధ్యాయులు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో దొరలపాలన పోయింది

**ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ**



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

**తిమ్మాపూర్:** కరీంనగర్ ముఖద్వారం కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధిలోని అల్గునూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో దొరలపాలన పోయిందని, అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలించే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో పాలన చేస్తామన్నారు. దొరల పాలనలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కరువైందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే విగ్రహం ఏర్పాటు చేసుకోవడం గర్వంగా ఉందన్నారు. దళితుల ఆత్మగౌరవం కోసం అంబేడ్కర్ చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో గూడ కనకయ్య, సిరిసిల్ల చంద్రయ్య, సిరిసిల్ల నరసయ్య, కుంభాల లింగయ్య, అంబేడ్కర్ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేను కలిసిన డీటీసీ..**

కరీంనగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పురుషోత్తం మంగళవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కరీంనగర్ డీటీసీగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఎమ్మెల్యేను కలిసినట్లు ఆయన తెలిపారు. డీటీసీ వెంట ఎంవీఐలు శ్రీకాంత్ చక్రవర్తి, రవికుమార్ తదితరులు ఉన్నారు.

## రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



శంకరపట్నం: మాట్లాడుతున్న ప్రియదర్శిని





తిమ్మాపూర్: అవగాహన కల్పిస్తున్న మమత

**శంకరపట్నం:** వరిలో మొగి పురుగు లక్షణాలు కనిపిస్తున్నాయని, పంటలో చీడపీడల ఉధృతి ఉందని రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆత్మ పీడీ ప్రియదర్శిని అన్నారు. మంగళవారం మండలంలోని తాడికల్ రైతు వేదికలో పంటల సాగులో తీసుకోవాల్సిన చర్యలపై రైతులతో సమావేశం నిర్వహించారు. మొగి పురుగు నివారణకు సూచించిన మందులు పిచికారీ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో బీటియం సునీల్, ఏఈఓలు లక్ష్మప్రసన్న, శ్రావణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**సైదాపూర్:** యాసంగిలో పంటల సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యంపై మంగళవారం సైదాపూర్ రైతువేదికలో ఏఈవో నిఖిల్ రైతులకు అవగాహన కల్పించారు.

**తిమ్మాపూర్:** మండలంలోని నుస్తులాపూర్, మల్లాపూర్ రైతువేదికల్లో వరిలో చీడపీడల నివారణ, యాజమాన్య పద్ధతులు, రసాయన ఎరువుల వినియోగంపై వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. మల్లాపూర్‌లో వ్యవసాయ అధికారి మమత, నుస్తులాపూర్‌లో ఏఈవో స్వామి మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అగ్గితెగులు సోకే అవకాశం ఉందని నివారణకు సూచించిన మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏఈవోలు స్వామి, రఘు మల్లాపూర్ పంచాయతీ కార్యదర్శి పద్మ, రైతులు పాల్గొన్నారు.

## ప్రజల బాగోగులు తెలుసుకోవడానికి ప్రజాహిత యాత్ర



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ

**తిమ్మాపూర్:** కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రజల బాగోగులు తెలుసుకోవడం కోసమే ఎంపీ బండి సంజయ్ ప్రజాహిత యాత్ర చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మూగ జయశ్రీ,, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కష్ణారెడ్డి అన్నారు. మానకొండూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాల్లో మార్చి 2 నుంచి జరగబోయే యాత్రకు సంబంధించి తిమ్మాపూర్ మండల కేంద్రంలో మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తెలుసుకుంటూ బీజేపీ మద్దతుగా ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ ఆదేశాల మేరకు ప్రతీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కార్యకర్తలను కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులుసంపత్‌రావ్, భాస్కరాచారి, అసెంబ్లీ కన్వీనర్ జగన్ రెడ్డి, మాజీ జడ్పీటీసి జోగిరెడ్డి,మాజీ ఎంపీపి రాములు,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొమురయ్య, జిల్లా అధికార ప్రతినిధి సమ్మిరెడ్డి,తిమ్మాపూర్, మానకొండూర్, ఇల్లంతకుంట, బెజ్జంకి, హుజూరాబాద్, ఇల్లందకుంట మండలాల అధ్యక్షులు జగదీశ్వరాచారి, ప్రవీణ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, రాజు, తిరుపతి రెడ్డి వివిధ మండలాలకు చెందిన శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు, నాయకులు, కార్యకర్తలున్నారు.

**మానకొండూర్:** మార్చి 2న మండలంలో జరిగే ప్రజాహిత యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు భాస్కరాచారి కార్యకర్తలను కోరారు. మండలంలోని చెంజర్ల గ్రామంలో లాబర్తి సంపర్క్ అభియాన్ వర్క్‌షాప్ నిర్వహించి మాట్లాడారు. మండలంలో కేంద్ర ప్రభుత్వం పథకాల లబ్ధిదారులు ఏడువేల మంది ఉన్నారని, రెండో విడత ప్రజాహితలో ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటరు రమేశ్‌పటేల్, వెల్మారెడ్డి రాజేందర్‌రెడ్డి, జిల్లా నాయకులు అప్పని తిరుపతి, సొన్నాకుల శ్రీనివాస్, బాషబోయిన ప్రదీప్‌యాదవ్, మీస రమణయ్య, కోల శ్రీనివాస్, దొంగల శ్రీదర్, ఆదిమూలం శ్రీనివాస్ పాల్గొన్నారు.

**ఇల్లందకుంట:** మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు హాజరై మాట్లాడారు. బండి సంజయ్ ప్రజాహిత యాత్ర విజయవంతం చేయాలన్నారు. కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి రాబోతుందని, దేశం మొత్తం మోదీ వైపు చూస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ మాడ గౌతమ్‌రెడ్డి, నాయకులు ఉప్పుల రమేష్,నల్ల లింగారెడ్డి, బైరెడ్డి రమణారెడ్డి, ఆరెల్లి శ్రీనివాస్, శీలం శ్రీనివాస్, కంకణాల సురేందర్‌రెడ్డి, తాళ్ల లావణ్య,మట్ట పవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



జమ్మికుంట: చెప్పుల దండ వేసి ఎంపీ చిత్రపటాన్ని దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**సాక్షి నెట్‌వర్క్:** బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సభ్యులపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో ఎంపీ బండి సంజయ్‌కుమార్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. ఎంపీగా, మంత్రిగా పొన్నం ప్రాంతానికి చేసిన సేవలు గొప్పవన్నారు. బండి సంజయ్ ఎంపీగా గెలిచి ఈ ప్రాంతానికి ఏం చేశావో చెప్పాలని డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పాదయాత్రను అడుగడుగున అడ్డుకుంటామని హెచ్చరించారు. ఎంపీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బండి సంజయ్‌వి ప్రజలను రెచ్చగొట్టే మాటలు తప్పా ఏనాడు ప్రజా సమస్యలను పార్లమెంటులో వినిపించలేదన్నారు. దేవుడి పేరుతో అధికారంలోకి రావాలని చూస్తున్న బీజేపీకి ప్రజలు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. మంత్రి మాతృమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు. విజయ సంకల్ప యాత్రను అడ్డుపెట్టుకొని అయోధ్య పేరుతో మళ్లీ గెలవాలని ప్రయత్నిస్తున్నాడని విమర్శించారు.